


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఎన్ని కిలోల ప్రేమ?

మొన్న ఓ స్నేహితురాలు

“సియాటిల్‌లో వున్న మీ అబ్బాయి అడ్రెస్ ఇస్తారా? వేన్‌కోవర్‌లో వున్న మా అమ్మాయికి ఓ కొరియర్ పంపించాలి” అంది.

సరే అన్నాను.

కొరియర్ పంపింది. అల్లుడు కెనడా నుండి డ్రైవ్ చేసుకుంటూ వచ్చి తీసుకెళ్ళాడు అల్లుడితో పాటు గిల్లుడు అని నాకూ ఆవకాయ, మాగాయ ప్యాకెట్లు వచ్చాయి. ఐ యాం సో హాపీ. కానీ ఈ విషయంగా నాకు మా పెళ్ళయిన కొత్తల్లో, పిల్లలు చిన్నగావున్నప్పటి రోజులు ఫ్లాష్ బ్యాక్‌లో 'టార్‌టోయిస్' కాయిల్‌లో మొహం మీద గుండ్రాలుగా తిరిగాయి.

మేం శ్రీనగర్ కాలనీలో వున్నప్పుడూ, మల్కాజిగిరిలో వున్నప్పుడూ, హైదరాబాద్‌లో, చిక్కడపల్లిలో వున్న మా అమ్మ ఇంటినుండి, వెళ్ళినప్పుడల్లా మా టి.వి.ఎస్ కాలక్రమేణా వెస్పా మొదలైన వెహికల్స్ హాండిల్స్‌కి వేళ్ళాడుతూ బోలెడు సామాగ్రి వచ్చేది. మెయిన్‌గా హార్లిక్స్ బాటిల్స్‌లో పచ్చళ్ళూ, వడియాలూ, పిల్లలకి జంతికలూ, పల్లీవుండలూ, మిక్చరూ, చిప్పూ మొదలైన చిరుతిళ్ళు, నాకు కొన్ని చీరలూ, పిల్లలకి బట్టలూ, బొమ్మలూలాంటివి. ఒక్కోసారి అమ్మమ్మ జ్ఞాపకంగా ఇచ్చే రాచిప్పలూ, వెండి గ్లాసూ, నేను అమ్మతో షాపింగ్‌కి వెళ్ళినప్పుడు ముచ్చటపడి కొనుక్కున్న కొబ్బరికోరు పీటా.. జంతికల గొట్టం, కజ్జికాయల పీట లాంటివి. 1980లో మధ్యతరగతి ఆడపిల్లల షాపింగ్ అంటే గూచీ, మైకేల్ కోర్స్, గెస్, బీబా లాంటి బ్రాండెడ్ షూస్, డ్రెసెస్, హాండ్ బ్యాగ్స్ పెర్ఫ్యూమ్స్ వుండేవి కావు.

తిరుపతి వెళ్ళి వస్తూ అత్తయ్య తెచ్చిన తిరుచానూరు పద్మావతీ గాజులు (లేత నీలి రంగులో వాటి మీద తిరుపతి, తిరుమల అని రాసి వుండేవి) మా పిల్లలకి తీర్థంలో కొన్న బూరలూ, గిలక్కాయలూ, రైలు లేదా బస్సు బొమ్మలు, విమానం

బొమ్మ కొనడానికి కూడా మధ్య తరగతి తాహతు ఆలోచించేది, యాత్ర కెళ్తే పాత్ర కొనాలి అని మేం ఒక రాగి చెంబో, లేదా ఒక హారతి పళ్ళెమో, గోకర్ణమో (పులుసు వడ్డించే కొమ్ము చెంబు) నేతిగిన్నో, పంచెపాత్రో కొనేవాళ్ళం. కుంకుమ తప్పకుండా రెండు పొట్లాలు కట్టించి కొనేవాళ్ళం. ఇప్పటికీ నేను ఎవరికైనా ఇచ్చినా రెండు పొట్లాలుగా కట్టి ఇస్తాను. లాజిక్స్ అడగకూడదు. అమ్మమ్మ అలా చేసింది. అమ్మ అలాగే చేసింది. నేనూ చేస్తా. అంతే!

మళ్ళీ బొమ్మలు కొనేటప్పుడు ఆడ టాయ్స్ వేరు, మగ టాయ్స్ వేరూ.. మగపిల్లలకి బాట్, గన్, ఉండేలూ, కారూ, లారీలాంటివి. ఆడపిల్లలకి లక్కపిడతలూ, వంట సామాగ్రీ, ఆడపిల్లా మగపిల్లాడి పెళ్ళి కూతురూ, పెళ్ళి కొడుకూ బొమ్మలూ, వామన గుంటల పీటా (ఇక్కడ అమెరికన్ స్టోర్స్‌లో కూడా చూసా ఆ పీట) అష్టా చెమ్మా బోర్డ్, వైకుంఠపాళీలాంటివి. జడ రిబ్బన్లూ, మెడలో పూసలదండలూ, చెంపపిన్నులూ మా చిన్నప్పుడు వాణిశ్రీ ప్లాస్టిక్ చెవిలో పువ్వు, మెడలో ప్రేమనగర్ నక్లెసులూ, ఆడవాళ్ళకి దసరాబుల్లోడు చీరలూ లాంటివి. ఇంక తిరుపతి వెళ్ళి సవరాలు కొనేవాళ్ళు నాకు చాలామంది తెలుసు. ఇట్లా అమ్మా, పిన్నీ, పక్కింటావిడా ఇచ్చిన రకరకాల తీర్థంలో ప్రసాదాలతో నా బుట్టా, సంచీ నిండేవి.

భారమైన బహుకుటుంబ భారానికి ఒంగిపోయిన బడుగు జీవిలా మా టి.వి.ఎస్ కృంగిపోయేది ఈ సంచులతో. వెనకాల ఇద్దరు పిల్లలతో నేనూ. మావారు నిప్పు తొక్కినట్లు కోపంతో చిందులేసేవారు.

"మీ అమ్మ ఇంటికి చక్రాలు పెట్టి ఇచ్చేస్తే ఎలా తీసుకెళ్ళను దీనిమీద? " అనేవారు (మా వారికి మా అమ్మా వాళ్ళు కారు ఇవ్వాలనే కుటిల వ్యూహాలు ఆ రోజుల్లో లేవని గమనించగోర్తాను.)

"ఈ ఒక్క సంచీ తగిలించెయ్. పిల్ల మొన్న గాజుగ్లాసులో టీ తాగాలని ముచ్చట పడింది. పెద్దాడికి చిన్న దిండు కుట్టించాను. చిన్నాడికి కొమ్ముగ్లాసు." ఇలా ఇస్తూనే వుండేది అమ్మ.

రోజులు మారాయి. ఇప్పుడు అలా జంతికల గొట్టం, కొబ్బరికోరు పీటా, చూసి మురిసిపోయే రోజులు కావు. పిల్లలకి కొరియర్లు అంటే వేలవేల రూపాయల వ్యవహారం. వాడు ఖాళీ సంచి ఇచ్చి వచ్చినా విమానాల్లో పదివేలు అంటాడు మరి. నాకు ఈ ఎన్.ఆర్.ఐ పిల్లల యూట్యూబ్‌లో వ్లాగులు చూస్తుంటే మతిపోతుంది. ఇండియానుండి వచ్చిన డెబ్బై కిలోల కొరియర్ హాల్ అని పెడ్తారు. అందులో నాన్ వెజ్ పికిల్స్ రొయ్యలూ, పీతలూ, చికెనూ, మటనూ నానా రకాలూ కొన్ని కిలోలు. ఆవకాయ, మాగాయ, చింతకాయ, ఉసిరికాయ, అల్లం, గోంగూర, దొండకాయ, కాకరకాయ, చిలకడదుంప, క్యాబేజీ, టమాటా.. కాదేదీ కవిత కనర్హం అని శ్రీశ్రీగారన్నట్లు.. ఊరగాయకి అనర్హం కానిదేదీ లేదు అని అన్నింటితో పెట్టేసి పంపినవి కొన్ని కేజీలు. ఇంక వడియాల్లో చిన్నప్పుడు బూడిద గుమ్మడి, మినప వడియాలు, సగ్గుబియ్యపువి, బియ్యపువి మాత్రమే వుండేవి. ఇప్పుడు ఉల్లిపాయ, కాబేజీ, టమాటా, అటుకులు, ఆలూలాంటివి అనేక వడియాలు, ఊరమిరపకాయలు, కొబ్బరిపొడి, ధనియాల కారం పొడి, మాడ్చిన కారం, సెనగపొడి, పల్లీపొడి, కందిపొడి, అవిశపొడి, నువ్వులపొడి,ఇట్లా రకరకాల పొడులు.. సున్నుండలు, రవ్వలడ్లు, బూందీ లడ్డూ, కొబ్బరి లడ్డూ, బూరెలు, అరిసెలు, పప్పు

చెక్కలు, మురుకులు.. మళ్ళీ వాటిలో రకాలు. అసలు ఓ మొగుడూ పెళ్ళాం అన్నం మానేసి ఇవే తిని బతికినా ఇవి అన్నీ ఆ ఏడాదంత తిన్నా మిగిలిపోతాయి. ఎలా తింటారో? మరి ఇంకా విడ్డూరం ఒక ఢిల్లీ అమ్మాయి నిన్న తల్లీ తండ్రీ విమానం ఎక్కేముందు ఢిల్లీలో మొమోస్, వెజ్ ప్యాటీస్, చోలే బతూరా, చికెన్ బిర్యానీ ప్యాక్ చేయించి తీసుకురమ్మందిట. తెచ్చారు.

ఇంక ఆడపిల్ల అడిగింది కదా అని ఇక్కడ ఇండియాలో తల్లులు పడే హైరాన అంతా ఇంతాకాదు. చింతపండు ఉడకపెట్టిన పులుసు, ఏడాదికి సరిపడా. 'అదేవిటో చింతపండు నానపెట్టుకోడం బద్దకమట' ఇక్కడ బెల్లం బాగోదు అని ఐదు కేజీలు. అసలు అంత బెల్లం ఏం చేసుకుంటారు? ఓ మొగుడూ పెళ్ళాం. కారం అస్సలు బాగోదు. మిరపకాయలు తెచ్చి తొడిమలు తీసి, ఎండపెట్టి పట్టించి పంపండి. సాంబారు కారం ఇది మరీ ఎక్కువ పని. కుంకుడు కాయలు కొట్టి, పిప్పి పంపండి. కొబ్బరి పుడకలు ఇచ్చి నూనె ఆడించి పంపండి. సన్న ఆవాలు కావాలి. ఉస్మానియా బిస్కెట్లు, కాకినాడ కాజాలు, చంటాడి మాలిష్‌కి ఆవు వెన్న, అల్లుడికి వెన్నకాచిన నెయ్యి. పసుపు కొమ్ములతో పట్టించిన పసుపు. హిరణ్యాక్ష వరాలు అనుకోండీ.

హాలంతా ఈ కొరియర్లో సామాన్లు పరిచేసి 'హాల్' అని ఒక వ్లాగ్. ఈ వ్లాగ్ కోసమే ఇవన్నీ తెప్పిస్తారా అని అనుమానం వస్తుంది నాకు.

ఇంక వీళ్ళ వెర్రి సంతకెళ్ళా. పండగలొస్తే ఇండియానుండి దేవుడి బొమ్మలు, ఇత్తడి విగ్రహాలు, ఆర్టిఫిషియల్ నగలు, పూసలు, చెమ్కీలు, 'డెకోర్' అంటూ, వెనకాల తగిలించే కర్టెన్లు, వాటికి అతికించే రంగురంగుల బొమ్మలు, ఫ్లాస్టిక్ అరిటి చెట్లు, మావిడి ఆకులు, రిటర్న్ గిఫ్ట్స్ పేరిట అర్థరహితమైన బొమ్మలు, బుట్టలు, బట్టలు వాళ్ళ తలకాయలు.. ఇవన్నీ వీళ్ళ డబ్బులతో కొన్నవి అయినా వేస్టేజ్ ఈజ్ వేస్టేజ్.

ఇంక ఆడపిల్లల పేరెంట్స్ విషయానికొద్దాం. కొందరు వర్కింగ్ విమెన్ వుంటారు. పాపం ఏ శని ఆదివారలలోనే ఈ ఊరగాయలూ, పొడులూ, పిండి వంటల పని చెయ్యాలి. లేదా స్వగృహాలూ, స్వీట్ షాపులూ అవీ పిల్లలకి అంగీకారమైతే అక్కడ కొనాలి. ఏదైనా ధరలు వాచిపోతాయి. ఇంకా చాదస్తంగా ఫలానా పేస్టే వాడతాం, ఫలానా సబ్బులే వాడతాం అంటే అవీ కొని పంపించేవాళ్ళుంటారు. రెడీమేడ్ బట్టలు, గాజులు, ఏ డ్రెస్ కా రంగు గిల్ట్ నగలు (పిచ్చివి.. అంటారు ఆంధ్రాలో తలకి జుట్టు బిట్స్ అంటారు సినిమావాళ్ళు) ఇంక జాకెట్లకీ, చీరలకీ వర్క్‌కి ఎన్నేసి వేలు పెడ్తారో లెక్కేలేదు. ఇంక సంవత్సరానికి ఒకటి రెండు చేసే సంతర్పణలకి తగిన వంట సామాన్లు ఘటోత్కచుడి గంగళాలూ, భీముడి బాండీలులాంటివి. ఇంక వరలక్ష్మీ వ్రతాలకీ, దసరా పూజలకీ వినాయక చవితులకీ ఆ దేవుళ్ళ మొహాలూ, రూపులూ, వెండి పువ్వులూ, ఇత్తడి వాయినాల పళ్ళేలూ, ఓయమ్మో! ఇండియాలో వుండగా స్నానం చేసి పూజగది మొహం అయినా చూడని వాళ్ళు ఇక్కడ ఎన్నెన్ని పూజలో. పైగా ఒక వ్లాగర్ మొహాన బొట్టూ, మెడలో మంగళసూత్రం, చేతికి ఒక్క గాజైనా లేదు మంగళవారం నోములు చేస్తూ వ్లాగ్ వీడియో. దేవుడికన్నా ముందు ప్రసాదాలు ఇన్‌స్టాలో, ఫేస్‌బుక్‌లో, యూ ట్యూబ్

సబ్‌స్క్రైబర్స్‌కి నైవేద్యం. ఆ తల్లులు అయినా చెప్పరు పూజ అప్పుడైనా బొట్టుపెట్టుకోమని. వంటిల్లు అక్కర్లేని సామానుతో, డ్రాయింగ్‌రూములు పిచ్చి డెకార్‌లతో నింపేయడమే కాకుండా, ఇంకొక ట్రెండ్ తిరగలి, రుబ్బురోజు, రోకలి బండలు, గొలుసుల ఉయ్యాలలు.. ఇవన్నీ కూడా షిప్పింగ్ చేయించి తెప్పించుకుంటున్నారు. పిల్లలకి పుట్టినరోజులు నెలనుండీ మొదలయి ఏడాదిదాకా చేస్తారు వ్లాగర్స్, పారాడడం రాని పిల్లలకి ఎన్నెన్ని సూట్లో, ఎన్నెన్ని లాల్చీ పైజమాలూ, పట్టు పరికిణీలో.. ఆ ఏడాది పిల్లలుకూడా వీడియో కెమేరాలు పెడ్తే బోలెడు స్టైల్స్ కొట్టేసి పోజులు పెడ్తున్నారు. విత్తొకటి వేస్తే చెట్టొకటి వస్తుందా మరి? ఇంక కూతుళ్ళ పెళ్ళిళ్ళలో, శ్రీమంతాలలో మనవల బారసాలల్లో ఓణీలంగా వేసుకుని డాన్స్ ఆడే అమ్మమ్మలూ, నానమ్మలూ కొత్త ట్రెండ్ అయితే, భయంకరమైన అతికి పరాకాష్ట. కుక్కలకి శీమంతం, బారసాలలూ, వెండి ఉయ్యాలలో బంగారు కిరీటాలు పెట్టి, పట్టు బట్టలు కుట్టించి, చుట్టూ మిఠాయిలు పెట్టి దాన్ని వదిలేస్తే అదెళ్ళి నానా కల్మశం తింటుంది. బతుకు జీవుడా ఈ పిచ్చోళ్ళ బారిన పడ్డానేంటి అనుకుంటూ ఆ మధ్య ఓ వీడియో చూసా. కుక్కనోట్లో ఓ ముద్ద, పిల్లాడి నోట్లో ఓ ముద్దా పెట్టి, అదే చేత్తో ఆవిడా తినేస్తోంది.

సరే.. తల్లుల సంగతి చూద్దాం. కొంతమంది తల్లులకి ఓపికలుండవు. అనారోగ్యంగా ఉంటారు. ఊరగాయలు పెట్టడం, అప్పడాలూ, వడియాలూ పెట్టడం ఫ్లాట్స్‌లో వుండేవారికి బహు కష్టం. కొందామా అంటే 'నీ చేత్తో పెట్టిన ఊరగాయే తింటాం' అన్న కూతుళ్ళ డిమాండ్. కన్నావుగా పెట్టక చస్తావా అన్నట్లు. సరే పెడ్తారు. కొరియర్ ఛార్జీలు ఎంత ఖరీదులూ, వేలకి వేలు ఖర్చు. రిటయిరైన చిన్న ఉద్యోగులకీ, నిరుద్యోగులకీ, తామే కొడుకులూ కోడళ్ళ దగ్గరున్న వారికీ, వయసు వుడిగిపోయిన వారికీ ప్రేమ వున్నా, డబ్బు వుండద్దూ? ఈ 'హాల్' అంటూ హాలంతా సామాన్లు పరిచేసే అమ్మాయిలు అవి ఆలోచిస్తున్నారా? పోనీ వాళ్ళే మొగుడికి తెలీకుండా ఆ డబ్బు పంపారనే అనుకుందాం, ఆ మొగుడు కష్టపడి సంపాదించి డాలర్లలో ఇంటికి తెచ్చేది ఈ పిచ్చ ఖర్చులకా? ఆ రోల్డ్ గోల్డ్ నగలూ, చెమ్కీ జాకెట్లూ ఇంటినిండా వున్నవి. రేపు ట్రాష్‌బిన్‌లో పారెయ్యడానికేగా? ఎవరైనా నయాపైసా ఇచ్చి తీసుకుంటారా వాటిని? ఓ అమ్మాయి సెకెండ్ హాండ్ డ్రెసెస్, చిన్న పిల్లల గౌన్లూ, చీరలూ అమ్మకం కూడా పెట్టింది. ఎవరూ కొనలేదు. ఎవరికైనా వస్తువులు మాత్రం ఫస్ట్ హ్యాండ్‌వే కావాలి.

నాకు తెలిసిన ఒకావిడ చాలా మొహమాటపడ్తూ కూతురితో చెప్పడానికి నాకు చెప్పింది "అది కనిసం కారంపొడీ, పసుపూ, చింతపండూ, నెయ్యి కూడా కొనుక్కోకుండా నన్ను ఇండియానుండి పంపమంటోంది. కొరియర్లకి పదేసి వేలు ప్రతినెలా కడ్తున్నాం. ఏదో పెన్షన్‌తో నెట్టుకొస్తున్నవాళ్ళం ఎక్కడినుండి తెచ్చేది. ఇలా పంపుతున్నామని తెలిసి కోడళ్ళు అలిగి మాట్లాడటంలేదు. మాకేమీ ఇవ్వరు అని" అని బాధపడింది. ఇలా బాధ్యతా రహితమైన కూతుళ్ళు కూడా కొందరు ఉన్నారు. బట్ మాగ్జిమమ్ తల్లులదే తప్పు. ఇంటి ఆయన పాకెట్ భరింగగలదా లేదా చూడకుండా ఇంటికి చక్రాలు పెట్టి ఆడపిల్లలకీ,

మగపిల్లలకీ కూడా విదేశాలకి కొరియర్ చేస్తున్నారు. కనీసం వాళ్ళకి సామాన్లు బదులు డబ్బులిస్తే ఈ మధ్యలో కొరియర్ వాళ్ళని మేపడం తగ్గుతుంది. ఆ డబ్బుతో అక్కడే కొనుక్కుంటారు.

ఇవన్నీకూడా నేను డబ్బున్నవాళ్ళ గురించి చెప్పడంలేదు. మధ్య తరగతి వ్యధలే చెప్తున్నాను. అటు ఉన్న వాళ్ళ ఆడంబరాలని చూసి వాతలు పెట్టుకోలేకా, ఇటులేని వాళ్ళలా సరిపెట్టుకోలేకా రెక్కలు ముక్కలు చేసుకుని, జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

నలభైలు పై బడిన కూతుళ్ళు కూడా తల్లిపంపే ఊరగాయల కోసం చూడకుండా హాయిగా కొనుక్కోడమో, పెట్టుకోవడమో చెయ్యాలి. తల్లి మూలుగుతే తను తన మొగుడ్నీ పిల్లలనీ వదిలి వచ్చి పదిరోజులు సేవ చెయ్యగలనా? అని ఒకసారి ప్రశ్నించుకుని అప్పుడు తమ కోరికలని కొరియర్ చెయ్యమనాలి.

తల్లులు కూడా ప్రేమల్ని ఇంత పెద్ద 'హోల్'గా పంపడం మానుకోవాలి. అవన్నీ తిన్నాక వాళ్ళు 'జిమ్'లకి వెళ్ళి చచ్చేట్టు శ్రమపడాలి పాపం. లేదా మిడిల్ ఏజ్‌లోనే బిపిలూ షుగర్‌ల పాలౌతారు.

ఇంతకీ మీరు ఎన్నేసి కేజీల ప్రేమలు కొరియర్ చేస్తున్నారూ?

Post your comments







